# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 17-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని ప్రభుత్వ అధికారులు వెల్లడించారు.
- మహిళా రిజర్వేషన్ బిల్లుకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతునిస్తోందని ఆ పార్టీ పార్లమెంటరీ నాయకులు లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు.
- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు రాష్ట్రప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.
- రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాలను 832 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలియజేశారు.

=====================

రాష్ట్రంలో గృహ వినియోగ ఎల్పీజీ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ జనరల్ మేనేజర్, స్టేట్ లెవెల్ కో-ఆర్డినేటర్ ఎన్. భాస్కర్ రెడ్డి తెలిపారు. విజయవాడలో ఈరోజు జరిగిన మీడియా సమావేశంలో ఆయన.. రాష్ట్రంలో ఎల్పీజీ సరఫరా, ఇంధన నిల్వలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ప్రజలు పెద్ద ఎత్తున బుకింగ్స్ చేయడం వల్ల కొన్నిచోట్ల డెలివరీలో జాప్యం జరుగుతోందన్నారు. బుకింగ్స్ సంఖ్య భారీగా పెరగడంతో వాణిజ్య సిలిండర్ల సరఫరాలో కొంత మేర కోత విధించి గృహ అవసరాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రస్తుతం.. గృహ వినియోగ ఎల్పీజీ సరఫరా 100 శాతం జరుగుతోందని, వాణిజ్య ఎల్పీజీ సరఫరా మాత్రం గత వినియోగంలో 70 నుండి 80 శాతం వరకు సరఫరా జరుగుతోందని వివరించారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భాస్కర్ రెడ్డి సూచిస్తూ...

(వాయిస్…32 సెకన్లు)

=====================

అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తోందని జలవనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో ఈరోజు ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. పాలకొల్లు, నరసాపురం పంటకాలువపై సీసీ వాల్స్ నిర్మాణం, ఎర్ర వంతెన, దాసరి బ్రిడ్జిల మరమ్మత్తులు, నాగరాజుపేటలో వంతెన నిర్మాణం, ర్యాంపు నిర్మాణ పనులు, పార్వతీనగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం మొదలైన పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నామని తెలియజేశారు.

=====================

రాష్ట్ర వ్యాప్తంగా ఆలయాలను 832 కోట్ల రూపాయలతో అభివృద్ధి చేయనున్నట్లు దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా రాపూరు మండలం పెంచలకోనలో బ్రహ్మోత్సవాలపై ఆయన అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. ఇప్పటికే ఈ నిధుల విడుదలకు సంబంధించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలు జారీ చేశారన్నారు. టిటిడికి చెందిన శ్రీవాణి

ట్రస్ట్ ద్వారా 750 కోట్ల రూపాయలతో 5 వేలకు పైగా భజన మందిరాల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఆలయ పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేసి ఆధ్యాత్మిక పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేస్తామని మంత్రి ఈ సందర్భంగా తెలియజేశారు.

====================

హిమోఫిలియ వ్యాధిగ్రస్తులకు రెడ్‌క్రాస్ సంస్థ అందిస్తున్న సేవలు నిరుపమానమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ప్రపంచ హిమోఫిలియ దినోత్సవం సందర్భంగా ఆ వ్యాధిపై ప్రజలలో అవగాహన పెంచేందుకు రెడ్ క్రాస్ సంస్థ గుంటూరులో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని లక్షా 36 వేలమంది హిమోఫిలియ బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా మందులు, పెన్షన్ అందిస్తోందని తెలిపారు. సేవ్ లైఫ్ అనే నినాదంతో నిర్వహించిన ఈ ర్యాలీలో రాష్ట్ర రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ రామచంద్రరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

====================

విరామం

====================

మహిళా రిజర్వేషన్ బిల్లుకు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతునిస్తోందని ఆ పార్టీ పార్లమెంటరీ నాయకులు లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. ఈరోజు లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్లపై ఎన్నో ఏళ్లుగా పోరాటాలు జరుగుతున్నాయని, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో మహిళా రిజర్వేషన్లు అమలు కాబోతున్నాయని వ్యాఖ్యానించారు. చట్టసభల్లో మహిళల గొంతుక పూర్తిస్థాయిలో వినిపించే అవకాశం వచ్చిందని, దేశంలో 50 శాతం ఉన్న మహిళల ఆకాంక్షలను నెరవేర్చాల్సి ఉందని పేర్కొన్నారు. అలాగే.. డీలిమిటేషన్ బిల్లుకు కూడా తమ పార్టీ మద్దతిస్తోందని శ్రీకృష్ణదేవరాయలు తెలియజేస్తూ...

(వాయిస్…29 సెకన్లు)

====================

ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ఈ నెల 27వ తేదీన జరగనున్న ఏయూ శతాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల నిర్వహణపై ఏయూ వీసీ జి.పి. రాజశేఖర్, జేసీ గొబ్బిళ్ల విద్యాధరి, జిల్లా అధికారులు, యూనివర్సిటీ అధికారులతో.. కలెక్టర్ ఈరోజు సంయుక్త సమీక్షా సమావేశం నిర్వహించి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు రెండు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ముగింపు వేడుకలకు ఉపరాష్ట్రపతి, గవర్నర్, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఐటీ శాఖా మంత్రి, ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు సచిన్ తెండూల్కర్ హాజరుకానున్న నేపథ్యంలో ప్రోటోకాల్, భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు.

====================

2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి బడి పిలుస్తోంది ప్రత్యేక ప్రవేశోత్సవ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని విజయనగరం కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈరోజు జరిగిన టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ.. ఈరోజు నుండి 23వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో అర్హత గల బాల, బాలికలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న పిల్లలు, 5వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు, డ్రాప్‌అవుట్స్, స్కూల్‌కు వెళ్లని పిల్లలను ప్రత్యేకంగా గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. స్లమ్ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.

====================

సంచార జాతుల విముక్తి, వారి సామాజికాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని కేంద్ర డీఎన్టీ బోర్డు సభ్యులు ప్రవీణ్ గుగే, భరత్ భాయ్ పాట్నీ తెలిపారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు రాష్ట్రంలోని సంచార జాతుల పరిస్థితిపై కీలక వ్యాఖ్యలు చేశారు. సంచార జాతులపై ఉన్న బ్రిటీష్ కాలం నాటి నేరపూరిత ముద్రను చెరిపివేసి, వారిని సమాజ ప్రధాన స్రవంతిలోకి తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న సుమారు 80 లక్షల మంది సంచార జాతుల వారి అభివృద్ధికి సీడ్ (SEED) పథకం ఎంతో దోహదపడుతుందన్నారు.

=====================

పరిశ్రమల స్థాపనకు యువత ముందుకు రావాలని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి పిలుపునిచ్చారు. ర్యాంప్ పథకంలో భాగంగా లఘు ఉద్యోగ్ భారత్ ఆధ్వర్యంలో ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సహకారంతో ఈరోజు ప్రారంభమైన రెండు రోజుల వెండార్ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఇలాంటి వేదికలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి దిశగా ఎదగాలని సూచించారు. పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనుకొనేవారికి అవగాహన కల్పించడంతో పాటు శిక్షణ ఇవ్వడానికి, ఉత్పత్తి, మార్కెటింగ్ అవకాశాలపట్ల ఒక ప్రణాళికలను రూపొందించుకోవడానికి ఇటువంటి సదస్సులు దోహదం చేస్తాయని వివరించారు.

=====================

తిరుపతి జిల్లా రేణిగుంట మండలంలోని ఎర్రంరెడ్డిపాలెం డంపింగ్ యార్డులో భారీ మొత్తంలో గంజాయిని దగ్ధం చేసినట్టు ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. సుమారు 20 కోట్ల రూపాయలు విలువైన 4 వేల కిలోలకు పైగా గంజాయిని దగ్ధం చేశామని ఎస్పీ ఈరోజు మీడియాకు తెలిపారు. శ్రీకాళహస్తి, నాయుడుపేట, పుత్తూరు సబ్‌డివిజన్‌ల పరిధిలో గత కొంతకాలంగా నమోదైన కేసుల్లో పట్టుబడిన మాదక ద్రవ్యాలను నాశనం చేశామన్నారు.

=====================
=====================